



అంతారంలో ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు

మేడ్చల్‌లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

అమ్మోర్లకు బోనాలు

కనుల పండువగా సాగిన బోనాల ఊరేగింపు

తాండూరు రూరల్, జూలై 14 : ఆషాఢమాసం బోనాల పండుగను పట్టణాలు, పల్లెల్లో ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. తాండూరు మండల పరిధిలోని అంతారం గ్రామంలో ఆదివారం రక్తమైసమ్మ, గండెమ్మ అమ్మవార బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల నడుమ బోనాల ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బోనాలతో వెళ్లి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, గ్రామ పెద్దలు పుల్ల వెంకట్‌రెడ్డి, చంద్రయ్య, సీహెచ్ లాలప్ప, పుల్లప్రభాకర్‌రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ నర్సింహులు, మాజీ సర్పంచ్ శేఖర్, మాజీ ఎంపీటీసీ శాంతు, మాజీ వార్డు సభ్యుడు రాజేందర్‌రెడ్డి, బి. ఆలప్ప, పెద్దకురవ సాయిలు, పెద్దకురవ బాబు, ఆశల్, కోస్గి ఆశన్న, చంద్రయ్య, లక్ష్మయ్య, వేణు, వడ్డె కృష్ణ, వెంకట్‌రెడ్డి, బాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విష్ణుశౌర్య బోనాలు

మేడ్చల్ టౌన్: మేడ్చల్‌లో విష్ణుశౌర్య బోనాల ఉత్సవాలు ప్రజలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఉమానగర్ నుంచి ఏడుగుడుల అమ్మవారి ఆలయం వరకు భక్తులు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకుంటారు.



మొహర్రం ఉత్సవాలు

గ్రామాల్లో పీర్ల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. తాండూరు మండల పరిధిలోని బెల్కటూర్, కరన్‌కోట్, ఉద్దండాపూర్, జినుగుర్తి, నారాయణపూర్, చెంగోల్, గౌతాపూర్ తదితర గ్రామాల్లో మసీదుల్లో పీర్లు కొలువు దీరాయి. భక్తులు మసీదుల వద్దకు బారులు తీరారు. ఊదు బెల్లం, దట్టీలు, పూలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బెల్కటూర్‌లో సోమవారం వేకువ జామున పీర్లను గ్రామంలో ఊరేగించారు.

- తాండూరు రూరల్, జూలై 14

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్య

- ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం
- నేటి నుంచి 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట'
- ఐదు రోజుల పాటు కొనసాగనున్న కార్యక్రమాలు



వికారాబాద్, జూలై14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల సంక్షేమంపై దృష్టి సారించింది. రెండున్నరేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీప్రైమరీ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. రెగ్యులర్ పాఠశాలల్లో చేరే నాటికి అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను సంసిద్ధులను చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ (పూర్వప్రాథమిక) పాఠశాలలుగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో పిల్లల కోసం కొత్తగా సిలబస్‌ను సిద్ధం చేసింది. చిన్నారులను గుర్తించి ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించేందుకు ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు అమ్మ మాట- అంగన్‌వాడీ బాట పేరిట ప్రత్యేక కార్యక్రమం చేపడుతోంది. ఈ కార్యక్రమం చివరిరోజు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నారు. ఈవిద్యా సంవత్సరం నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ చదువులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇటీవల నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరకుండామిగిలిపోయిన రెండున్నరేళ్లకు పైగాఉన్న చిన్నారులను సోమవారం నుంచి ఐదురోజుల పాటు కొనసాగనున్న అమ్మమాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో చేర్పించాలనే లక్ష్యం నిర్దేశించుకున్నారు.

మంచి అలవాట్లు నేర్పేలా బోధన

వికారాబాద్ జిల్లాలోని 20 మండలాల్లో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా, 1107 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కొడంగల్ ప్రాజెక్టు పరిధిలో 243 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, మర్పల్లి ప్రాజెక్టు పరిధిలో 148, పరిగి ప్రాజెక్టు పరిధిలో 213, తాండూరుప్రాజెక్టు పరిధిలో 279, వికారాబాద్‌ప్రాజెక్టు పరిధిలో 233 కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో 7నెలల నుంచి మూడేళ్ల లోపు 34 వేల మంది వరకు చిన్నారులు నమోదు కాగా, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయస్సున్న చిన్నారులు 22 వేలమంది వరకు నమోదయ్యారు. 6091మంది గర్భిణులు, 5398 మంది బాలింతలు నమోదు చేసుకున్నారు. కాగా, అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసి ప్రీప్రైమరీ స్కూళ్లుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. చిన్నారులకు ఆట పాటలతో విద్యా బోధన చేయాలనేది లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు ప్రీప్రైమరీ బోధన, చిన్నారుల ఆరోగ్యంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆట పాటలు, కథలు నేర్పించడమే కాకుండా మంచి అలవాట్లు అలవరుచుకునేలా శిక్షణ ఇవ్వనున్నారు. ప్రీప్రైమరీ పాఠశాలలుగా ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరే చిన్నారులకుయూనిఫాం అందించనున్నారు.

ఐదు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు

అమ్మమాట- అంగన్‌వాడీ బాట పేరిట ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 15, 16వ తేదీల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, బాలికలు, స్వయంసహాయక బృందాలు, పాఠశాలల టీచర్లు, యువతీ యువకులు, ఎన్‌జీవోలు, తల్లిదండ్రులు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి చిన్నారులను అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలని కోరనున్నారు. పాఠశాల, కళాశాల విద్యకు దూరంగా ఉండే బాలికలను గుర్తిస్తారు. సమావేశాలు నిర్వహించి రెండున్నరేళ్ల వయస్సు దాటిన చిన్నారులను ప్రీప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలని కోరనున్నారు. 18వ తేదీన ఇంటింటికీ వెళ్లి రెండున్నరేళ్లు దాటిన చిన్నారులను గుర్తించనున్నారు. ప్రీప్రైమరీ విద్య, తదితర అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నారు. 19వ తేదీన స్వచ్ఛ అంగన్‌వాడీ పేరిట కేంద్రాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో మొక్కలు నాటుతారు. కిచెన్ గార్డెన్, తాగునీరు, మరుగుదొడ్డి సదుపాయాలతో పాటు స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తారు. 20వ తేదీన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ డెవలప్‌మెంట్ డే, సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తారు. చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు, తాతలు, నానమ్మలు, అమ్మమ్మలను ముఖ్యఅతిథులుగా ఆహ్వానించి ప్రీ ప్రైమరీ విద్యపై అవగాహన కల్పించనున్నారు. ఆట వస్తువులకు చిన్నారులకు చూపించనున్నారు. పిల్లలను రోజూ ప్రీ స్కూల్‌కు పంపిస్తున్న తల్లిదండ్రులకు పురస్కారాలు అందజేసి ప్రోత్సహించనున్నారు.

పలు అభివృద్ధి ప్రాజెక్టుల రాకతో రంగారెడ్డి జిల్లాకు మహర్దశ పట్టనుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని, దీనికి మరింత ఊతం ఇచ్చేలా ప్రభుత్వం నూతన ప్రాజెక్టులను చేపట్టనుందని పేర్కొన్నారు. ఆదివారం అబ్దుల్లాపూర్ మెట్ మండలం లష్కర్‌గూడ తాటివనంలో గౌడన్నలకు రక్షణ కవచం కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా సీఎం హాజరై ప్రసంగించారు. గతంలో ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్‌పోర్టు వంటి బడా ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే వచ్చాయన్నారు. రానున్న కాలంలో న్యూయార్క్ నగరానికి పోటీ పడేలా మహేశ్వరంలో నూతన పర్యాటక నగరాన్ని నిర్మించనున్నామని తెలిపారు. కుల వృత్తుల వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



కార్యక్రమానికి హాజరైన గీత కార్మికులు, స్థానిక ప్రజలు

మహేశ్వరంలో.. పర్యాటక నగరం

ప్రపంచంలోనే అత్యద్భుతంగా తీర్చిదిద్దుతాం

- అభివృద్ధి ప్రాజెక్టులతో జిల్లాకు మహర్దశ!
- న్యూయార్క్ నగరంతో పోటీపడేలా మహేశ్వరంలో నూతన నగరాన్ని నిర్మించే బాధ్యత సర్కారుదే
- హైదరాబాద్ ఫార్మా భూముల్లో యూనివర్సిటీలు, మెడికల్ టూరిజం, పరిశ్రమల ఏర్పాటు
- రాచకొండ ప్రాంతాన్ని ఫిల్మ్ ఇండస్ట్రీ కేంద్రంగా మార్చుతాం
- త్వరలోనే హయత్‌నగర్‌కు మెట్రో.. నేరుగా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకునేలా ప్రణాళిక
- ఔటర్ రింగ్ రోడ్డుతో జిల్లాలో పెరిగిన భూముల విలువ
- గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి అర్బన్, జూలై 14): రంగారెడ్డి జిల్లాకు మహర్దశ రానుందని, ప్రపంచంలోనే అద్భుత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ తాటివనంలో సీఎం ఆదివారం ఈత మొక్క నాటారు. గౌడన్నలతో సీఎం, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు సహపంక్తి భోజనాలు చేశారు. గీత కార్మికులకు బీసీ కార్పొరేషన్ ద్వారా కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ పథకాన్ని సీఎం ప్రారంభించారు. ఈ కిట్ పనితీరును బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి బుర్ర వెంకటేశం సీఎంకు వివరించారు. అనంతరం గీత కార్మికులతో సీఎం ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం ప్రసంగిస్తూ.. అమెరికాలోని న్యూయార్క్ నగరంతో పోటీ పడేలా మహేశ్వరంలో ఒక అత్యద్భుత నగరాన్ని నిర్మించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఊటీ కంటే మెరుగ్గా రాచకొండ ప్రాంతాన్ని ఫిల్మ్ ఇండస్ట్రీకి అనువుగా మార్చబోతున్నామన్నారు. ఓడిపోయి ఫామ్ హౌస్‌లో ఉన్నోళ్లను అడుగుతున్నా.. ఔటర్ రింగ్ రోడ్, ఫార్మా ఇండస్ట్రీ, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలు కాదా? అని ప్రశ్నించారు. తామేం తెచ్చారో ప్రజలకు చెప్పాలని మాజీ పాలకులకు సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి పనులతోనే జిల్లాలో భూముల విలువ పెరిగిందన్నారు. డ్రగ్స్, గంజాయిలను సమూలంగా నిర్మూలిస్తామన్నారు. త్వరలోనే హయత్‌నగర్‌కు మెట్రో రానుందని, ఇందుకు ప్రణాళికలూ పూర్తయ్యాయని తెలిపారు. హయత్‌నగర్‌లో మెట్రో ఎక్కితే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకునేలా ప్రణాళికను రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. ఫార్మా కంపెనీల కోసం సేకరించిన భూముల్లో వివిధ యూనివర్సిటీలను, మెడికల్ టూరిజం, పరిశ్రమల ఏర్పాటు చేసేలా పథకాలను రూపొందిస్తున్నట్టు చెప్పారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో తాటి వనాలు తగ్గుతున్నాయని, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల్లో తాటి, ఈత చెట్లు పెంచుతామని తెలిపారు. వన మహోత్సవంలో తాటి, ఈత చెట్లను పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. చెరువు కట్టలపై ఈత మొక్కలు నాటేలా అధికారులతో చర్చించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు సూచించారు. గౌడన్నలు పౌరుషానికి, పోరాటాలకు ప్రతీకలని కొనియాడారు. జిల్లాకు ఎన్నో కీలక ప్రాజెక్టులు తేవటంలో మాజీ మంత్రి టి.దేవేందర్‌గౌడ్ కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం కుల వృత్తుల కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. కుల వృత్తుల వారు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి ఉన్నతాధికారులుగా తీర్చిదిద్దాలని సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, డి.శ్రీధర్‌బాబు, భువనగిరి ఎంపీ శ్యామాకిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహేందర్‌రెడ్డి, దయానంద్, మల్లేశం, ఎవీఎన్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీవో అనంతరెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'పట్నం' నియోజకవర్గానికి ఐటీ కంపెనీలు తెండి

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలో ఐటీ కంపెనీల ఏర్పాటుకు కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. నియోజకవర్గంలో వందల ఎకరాల్లో ప్రభుత్వ భూములున్నాయని, వాటిల్లో ఐటీ కంపెనీల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. దాంతో నిరుద్యోగులకు అవకాశాలు లభిస్తాయన్నారు. కోహెడలో ఫ్రూట్ మార్కెట్ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత పాలకులు 'పట్నం' నియోజవర్గంలోనే 2వేల ఎకరాల భూములను అమ్మేశారని ఆరోపించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పక్కన స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు



నూతన రక్షణ కవచాలతో తాటి చెట్లు ఎక్కిన గీత కార్మికులు



ఘట్‌కేసర్‌లో కురుస్తున్న వర్షం

జోరువాన

వికారాబాద్‌లో 45.0 మి.మీ. వర్షపాతం నమోదు

వికారాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం ప్రారంభమైన వర్షం అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది. రాత్రి 9 గంటల వరకు జిల్లాలో అత్యధికంగా వికారాబాద్ మండలంలో 45.0మి.మీ., వర్షం కురిసింది. నవాబ్‌పేట మండలంలో 44.3మి.మీ., ధారూరు మండలంలో 44.3మి.మీ., బంట్వారం మండలంలో 41.3మి.మీ. వర్షపాతం నమోదైంది. కోట్‌పల్లి మండలంలో 38.0మి.మీ., యాలాల్ మండలంలో 32.0మి.మీ., బషీరాబాద్ మండలంలో 26.5మి.మీ., దుద్యాల్ మండలంలో 26.5 మి.మీ., తాండూరు ఏఆర్ఎస్ మండలంలో 25.5మి.మీ., తాండూరుమండలంలో 24.5 మి.మీ., కులకచర్ల మండలంలో 24.0మి.మీ., దౌల్తాబాద్ మండలంలో 20.0మి.మీ., బొంరాస్‌పేట్ మండలంలో 20.0మి.మీ., పెద్దేముల్ మండలంలో 19.8మి.మీ., దోమ మండలంలో 19.3 మి.మీ., పరిగి మండలంలో 18.8 మి.మీ., పూడూరు మండలంలో 18.0మి.మీ., మోమిన్‌పేట్‌మండలంలో 17.0 మి.మీ., చౌడాపూర్ మండలంలో 16.3 మి.మీ., మర్పల్లి మండలంలో 16.3మి.మీ వర్షం కురిసింది. అంతేకాకుండా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై సన్నని చిరుజల్లులు కురుస్తూ సాయంత్రం వరకూ నాలుగు దఫలుగా మోస్తరు వర్షం కురిసింది. తరచూ మోస్తరు వాన కురియడంతో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదని రైతులు వాపోతున్నారు.

వికారాబాద్‌కు ఆరెంజ్ అలర్ట్

వికారాబాద్/ఘట్‌కేసర్ : జిల్లాలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వికారాబాద్ జిల్లాను ఆరెంజ్ అలర్ట్‌గా ప్రకటించడం జరిగిందన్నారు. భారీ వర్షాలవల్ల రోడ్లు కొట్టుకుపోవడం, ఉద్యాన పంటలు నష్టం, ప్రాణనష్టం జరుగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

సరదా సరదాగా..



కోట్‌పల్లి ప్రాజెక్టులో కలెక్టర్ ప్రతీక్ జైన్ బోటింగ్

వికారాబాద్/ధారూరు, జూలై 14 : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు.... చల్లబడ వాతావరణంలో పర్యాటకులు అనంతగిరి, కోట్‌పల్లి ప్రాజెక్టు వైపు పరుగులు తీస్తున్నారు. పచ్చని ప్రకృతిని ఆస్వాదించేందుకు అనంతగిరికి వచ్చేస్తున్నారు. ఆదివారం అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామిని దర్శించుకుని అనంతరం అనంతగిరి అడవుల్లో సరదాగా గడిపారు. నందిఘాట్ వద్ద ఫొటోలు దిగుతూ సందడి చేశారు నూతనంగా బాధ్యతలు చేపట్టిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అనంతగిరిలోని శ్రీ అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ అర్చకులు సన్మానించి ఆలయ విశిష్టతను తెలియజేశారు. ప్రతి నిత్యం ప్రభుత్వ పరిపాలనలో బిజీగా ఉండే కలెక్టర్ ప్రతీక్ జైన్ సెలవురోజైన ఆదివారం కుటుంబంతో కలిసి కోట్‌పల్లి ప్రాజెక్టుకు వచ్చి సరదాగా గడిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుటుంబం ప్రాజెక్టు అందాలను తిలకిస్తూ ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేశారు.

విద్యుత్ బిల్లులు
టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌లో చెల్లించాలి

వికారాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులను చెల్లించే వినియోగదారులు ఇకపై నుంచి టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌లో లేదా టీజీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో కానీ చెల్లించాలని వికారాబాద్ పట్టణ ఏఈ పూర్ణచందర్‌రావు తెలిపారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం 2024, జూలై 1వ తేదీ నుంచి ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే వంటి థర్డ్ పార్టీ యాప్‌లో విద్యుత్ బిల్లుల చెల్లింపులను నిలిపివేశారని ఆయన చెప్పారు. విద్యుత్ వినియోగదారులు టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, దాంట్లో యూఎస్‌సీ నెంబర్, మొబైల్ నెంబర్‌ను ఎంట్రీ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. తర్వాత పే బిల్లు ఆప్షన్‌పైన క్లిక్‌చేసి బిల్లు చెల్లింపులు చేయవచ్చున్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించే విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్నా 9440814041, లేదా 9440813081కు కాల్ చేసి నివృత్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు


శ్రీలత, టీజీఎస్‌ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్

వికారాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తమిళనాడులోని అరుణాచలం వెళ్లే భక్తుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఈ బస్సులను భక్తులు, యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని టీజీఎస్‌ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత కోరారు. ఈయాత్రకు వచ్చే భక్తులు అరుణాచలేశ్వరుడితో పాటు కాణిపాకం వినాయకుడిని, వేలూరు మహాలక్ష్మిని కూడా దర్శించుకునే అవకాశాన్ని టీజీఎస్‌ఆర్టీసీ కల్పించిందని ఆమె వివరించారు. ప్రత్యేక బస్సులు ఈనెల 19వ తేదీ రాత్రి 8గంటలకు హైదరాబాద్ ఎంజీబీఎస్ నుంచి బయలుదేరి 20వ తేదీ ఉదయం చిత్తూరు జిల్లా, కాణిపాకం చేరుకుంటాయని, అక్కడ వినాయకుడిని దర్శించుకున్న తరువాత తమిళనాడులోని వేలూరుకు బయలుదేరుతాయని ఆమె తెలిపారు. అక్కడ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న తరువాత అరుణాచలం చేరుకుంటాయన్నారు. 21వ తేదీన గురు పౌర్ణమి పురస్కరించుకుని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణ చేసిన తరువాత సాయంత్రం 5 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి, 22వ తేదీ, సోమవారం ఉదయం 6గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటాయని ఆమె వివరించారు. ఒక్కొక్కరికీ రూ.3,700 ఛార్జీ నిర్ణయించారని, టికెట్లను టీజీఎస్‌ఆర్టీసీ బుకింగ్ కౌంటర్లు, సైట్లలో రిజర్వు చేసుకోవచ్చని ఆమె ఓ ప్రకటనలో తెలిపారు.



గంధం క్వీనిని సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న జ్ఞాన వాహిని ఫౌండేషన్ సభ్యులు

ఇంగ్లండ్ చానల్ ఈదిన తెలుగు మహిళకు సన్మానం

ఆమనగల్లు, జూలై 14 : అంతర్జాతీయ ఫిన్ స్విమ్మర్ గంధం క్వీని విక్టోరియాకు రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో ఘన స్వాగతం లభించింది. ఇటీవల ఇంగ్లాండ్ నుంచి ఫ్రాన్స్ వరకు 36కిలో మీటర్లు స్విమ్ ఎవరెస్ట్‌గా పిలుచుకునే ఇంగ్లిష్ చానల్ ఈది తొలి తెలుగు ఓపెన్ వాటర్ లేడీ స్విమ్మర్‌గా క్వీని రికార్డు నెలకొల్పింది. ఆదివారం స్వస్థలం ఆమనగల్లుకు చేరుకున్న ఆమెను ఎంబీ ప్రేయర్ టవర్ చర్చి ఆధ్వర్యంలో జ్ఞానవాహిని ఫౌండేషన్ సభ్యులు, యువకులు స్వాగతం పలికారు. అనంతరం ఎంబీ ప్రేయర్ టవర్ చర్చిలో, భవానీ గార్డెన్‌లో ఫౌండేషన్ సభ్యులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అండర్ వాటర్ స్విమ్మింగ్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో అనేక పథకాలు సాధించిన క్వీని ఇంగ్లిష్ చానల్‌ను క్రాస్ స్విమ్మింగ్ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. క్వీని అంతర్జాతీయ స్థాయిలో రికార్డు నెలకొల్పడం గర్వకారణమన్నారు. స్విమ్మింగ్‌లో రాణిస్తున్న గంధం క్వీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతవ్వాలని కోరారు. అంతర్జాతీయ స్థాయిలో తాను సాధించిన రికార్డులను తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయకుడులకు అంకితమిస్తున్నట్లు క్వీని తెలిపారు. స్విమ్మింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో భారత్‌ను అగ్రభాగాన నిలపాలన్నదే తన ధ్యేయమన్నారు. ఇంగ్లండ్‌లోని డోవర్ కోస్ట్ నుంచి రిలే స్విమ్మింగ్ ప్రారంభించి ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ కోస్ట్ వరకు ఈదిన తొలి తెలుగు మహిళగా నిలవడం తనకు ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే సెవెన్ చానల్స్ ఈదాలన్నది తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంబీ ప్రేయర్ టవర్ చర్చి నిర్వాహకులు ఎస్తేర్, బాబ్జీ, అన్నపూర్ణ, శంకర్, రవి, మంజుల, నరేందర్, జ్ఞాన వాహిని ఫౌండేషన్ సభ్యులు రవీంద్రానంద్, లక్ష్మీనారాయణ, సత్యం, రంగారావు, డాక్టర్ వాసు, విడియాల ప్రసాద్, నర్సింహులు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మళ్లీ సీఎం కావడం ఆంధ్ర ప్రజల అదృష్టం

» మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

మొయినాబాద్ రూరల్, జూలై 14: గత ఐదేళ్లుగా అరాచక పాలనలో నరకయాతన అనుభవించిన ఆంధ్రప్రజలు.. ఎన్డీయే కూటమి గెలుపుతో ఏపీ సీఎంగా నారా చంద్రబాబు నాయుడు ఏపీకి ముఖ్యమంత్రి కావడం అదృష్టంగా భావిస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. నాలుగోసారి చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వడంతో ఆయనపై ఉన్న అభిమానంతో చంద్రబాబు పేరిట మండల పరిధిలోని ప్రముఖ క్షేత్రం చిలుకూరు బాలాజీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీలోని శ్రీశైల క్షేత్రం వరకు టీటీడీపీ మొయినాబాద్ మండల ఇన్‌చార్జి ఎల్గని యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో నలుగురు పార్టీ నాయకులు ఆదివారం మహాపాద యాత్రగా బయలుదేరి వెళ్లారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ముఖ్యఅతిథిగా హాజరై యాత్రను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజల శ్రేయస్సుకోసం నిత్యం పరితపించే నాయకుడు చంద్రబాబు నాయుడని అన్నారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఏపీ ప్రజల అదృష్టమన్నారు. చంద్రబాబు నాయుడుపై ఉన్న అభిమానంతో ఇక్కడి నుంచి మొయినాబాద్ మండల నాయకులు ఏపీలోని శ్రీశైలం క్షేత్రానికి మహాపాదయాత్రగా వెళ్లడం మాములు విషయం కాదన్నారు. వారికి దారిపొడవునా టీడీపీ నాయకులు సాదరస్వాగతం పలకాలని కోరారు. అంతకు ముందు బక్కని చిలుకూరు వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కాగా, చంద్రబాబు నాయుడు ఏపీ ప్రజలకు సుపరిపాలన అందించాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ స్వామిని కోరుకొని పాదయాత్రను ప్రారంభించినట్లు ఎల్గని యాదయ్యగౌడ్ చెప్పారు. శ్రీశైలంలో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు చెప్పారు. ఈ సందర్భంగా హిమాయత్ నగర్ చౌరస్తాలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. పాదయాత్రలో పాల్గొన్న వారిలో కార్తీక్, లోకేష్, నాగరాజు, ఆంజనేయులు ఉన్నారు. కార్యక్రమంలో చిలుకూరు చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్, మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణామాచారి, షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణ, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూపాల్‌రెడ్డి, రాఘవులు, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు బుర్రకాయల వెంకటేష్ ముదిరాజ్, ఎస్సీసెల్ కమిటీ సభ్యుడు షాబాద్ మాణిక్యం, మూర్తి, హరికృష్ణ గౌడ్, మల్లేష్ ముదిరాజ్, ప్రవీన్‌కుమార్, తోలుకట్ట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చిలుకూరు బాలాజీ ఆలయంలో పూజలు చేసిన అనంతరం బక్కని, నాయకులు

'ఆరని' వీధి దీపాలు





చెర్కుపల్లి, విశ్వనాథ్‌పూర్‌లలో పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

కొందుర్గు, జూలై 14: మండల పరిధిలోని గంగన్నగూడెం, చెర్కుపల్లి, విశ్వనాథ్‌పూర్ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు ఉన్న విద్యుద్దీపాలు పట్టపగలు కూడా వెలుగుతున్నాయి. ప్రతీ గ్రామంలో రెండు వీధులకు కలిపి విద్యుద్దీపాలకు ఆన్, ఆఫ్ సౌకర్యం ఉందని, మరో రెండు వీధుల్లో విద్యుద్దీపాలు వెలుగుతూనే ఉంటాయని, ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో దాదాపు 12 గ్రామాల్లోని వీధి దీపాలకు ఆన్, ఆఫ్‌లు లేవని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, ఆన్, ఆఫ్ లేని గ్రామాల్లోని వీధి దీపాలకు వెంటనే ఏర్పాటు చేసి, విద్యుత్ వృథా కాకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



చింతపట్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

చదువుతోనే సమాజంలో గుర్తింపు

యాచారం, జూలై 14 : చదువుతోనే సమాజంలో ప్రతీ ఒక్కరికి గుర్తింపు వస్తుందని, విద్యావ్యవస్థలో మార్పులు తేవాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్ దానయ్యలు అన్నారు. శనివారం సాయంత్రం యాచారం మండలంలోని చింతపట్లలో పర్యటించి గ్రామస్తుల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదోడికి ఉన్నత విద్య అందాలంటే విద్యావ్యవస్థలో ఎలాంటి మార్పులు అవసరమని విద్యావంతులు, గ్రామపెద్దలతో పాటు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విద్య అందాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి పథకాలు అమలు చేయాలని ఆరా తీశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివించాలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు శిక్షణ పొంది నాణ్యమైన విద్యనందిస్తారనే సంగతి గుర్తుంచుకోవాలన్నారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రతీ ఒక్కరు విద్యావంతులు కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీయేటా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఆంగ్లంపై ప్రతి విద్యార్థి పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో మన ఊరు-మన బడి కార్యక్రమం నిర్వాహకులు ఎండీ సాబేర్, ఉపాధ్యాయులు అంజయ్య, శ్రీకాంత్, మహేష్‌లతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. జర పైలం

పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు

» పరిసరాలు పరిశుభ్రత ముఖ్యం » అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



బషీరాబాద్‌లో మురుగు కాల్వల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుధ్య కార్మికులు

బషీరాబాద్, జూలై 14: వానాకాలం అపరిశుభ్రత కారణంగా గిరిజన తండాలు, గ్రామాల్లో దోమలు, ఈగలు రాజ్యమేలుతుంటాయి. వర్షపు నీరు ఎక్కడపడితే అక్కడ నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది వీటి వల్ల ప్రజలు రోగాలబారిన పడుతుంటారు. మలేరియా, టైఫాయిడ్, జ్వరాలు వ్యాప్తి చెంది చిన్నాపెద్దా తేడా లేకుండా మంచంపట్టే పరిస్థితులు నెలకొంటాయి. ముఖ్యంగా మురుగు కాల్వలు, ఖాళీస్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ప్రజలు ఇంటి సరిసరాల్లో ఖాళీస్థలాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ముందు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.



మైల్వార్‌లో దోమలమందు పిచికారి చేస్తున్న పంచాయతీ కార్మికులు

గ్రామ పంచాయతీల్లో చర్యలు

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో దోమలు వ్యాప్తి చెందకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో దోమల నివారణకు మురికి కాల్వలు, నీరు ఉన్న గుంతల్లో మందును పిచికారీ చేయిస్తున్నారు. అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య కార్మికులతో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నారు.



కొర్విచెడ్‌లో పిచ్చిమొక్కలను దగ్గరుండి తొలగింపజేస్తున్న కార్యదర్శి రాజు

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

ప్రజలు వర్షాకాలం తగు జాగ్రత్తలు తీసుకోవాలి. క్లోరినేషన్ చేసిన నీటిని, కాచి చల్లార్చిన నీటినే తాగాలి. ఇళ్ల పరిసరాల్లో పిచ్చిమొక్కలు లేకుండా, చెత్తా దాదారం లేకుండా ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమల నుంచి రక్షణ కోసం దోమ తెరలు వాడాలి. ఎప్పటికప్పుడూ వేడి ఆహారం తీసుకోవాలి. కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. ఇంటి ఆవరణ, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.

డ్రైడే నిర్వహిస్తున్నాం



మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నాం. మురుగు కాల్వలను శుభ్రం చేయించే కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాం. మురుగు కాల్వల్లో దోమల మందు పిచికారితో పాటు, నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయిస్తున్నాం. పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగుతున్నాయి.

- రమేష్, ఎంపీవో బషీరాబాద్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మన ఇళ్లచుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వీలైనంత వరకు వేడి ఆహారం భుజించాలి. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలి. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ జ్వరంవస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

డాక్టర్.శ్రీకాంత్, పీహెచ్‌సీ వైద్యులు, బషీరాబాద్

గగన్‌పహాడ్‌లో బెల్టు షాపులపై దాడులు

» మద్యం సీసాల స్వాధీనం

» ఇద్దరు నిందితుల అరెస్టు

శంషాబాద్, జూలై 14: శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధి గగన్‌పహాడ్ బస్తీలో ఆదివారం రాత్రి బెల్టు షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని బీరు, క్వార్టర్ సీసాలను స్వా ధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గగన్‌పహాడ్ బస్తీలో బెల్టు షాపుల్లో జోరుగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారనే సమాచారంతో పోలీ సులు దాడులు నిర్వహించారు. 49 బీరు, 64 క్వార్టర్ సీసాలు లభ్యమయ్యాయి. అక్రమంగా మద్యం అమ్ముతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఆర్జీఐఏ పోలీసులు తెలిపారు.

లాజిస్టిక్స్ ఏజెంట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడిరంగారెడ్డి జిల్లాలో టీజీఆర్టీసీ లాజిస్టిక్స్ ఏజెంట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి రీజియన్ ఏటీఎం రవీందర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పట్టణాలు, మండల, గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ లేదా ఆసక్తి కలిగిన వారు ఆర్టీసీ లాజిస్టిక్స్ ఏజెంట్లుగా కొనసాగేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రాంతంలో రూ.5 వేలు, మండల, గ్రామీణ ప్రాంతాల్లో రూ. వెయ్యి చెల్లించి ఏజెన్సీని తీసుకోవచ్చని తెలిపారు. రంగారెడ్డి- హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్రలకు సంబంధించిన వారు భానుప్రసాద్, సెల్ నెంబరు 9154298733, పరిగి, కులకచర్ల, బొంరాస్‌పేట్, దేశాయిపేట్, గుర్మిట్కల్, యాద్గిర్ ప్రాంతాలకు సంబంధించిన వారు విశ్వనాథ్ గౌడ్, 9154298738 నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. తాండూరు, కొడంగల్, సేడం, చించోలి, పెద్దేముల్, ధారూరు, బంట్వారం, కోట్‌పల్లి మండలాలకు చెందిన వారు చంద్రయ్య, ఫోన్ 9154298739కు వికారాబాద్, మోమిన్‌పేట్, మర్పల్లి, చేవెళ్ల, నవాబ్‌పేట్, మన్నేగూడ, మొయినాబాద్, శంకర్‌పల్లి ప్రాంతాలకు చెందిన వారు వసంత్‌గౌడ్, ఫోన్ 9154298740లకు కాల్ చేసి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, జూలై 14 : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం నగరంలోని మంత్రి నివాసానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి వెళ్లి మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వారితో పలువురు నాయకులు ఉన్నారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు నిధులు కేటాయించండి

» మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యేల వినతి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యేలు

షాద్‌నగర్ అర్బన్/పరిగి, జూలై 14: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించాల్సిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేలు కోరారు. ఈమేరకు ఆదివారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో షాద్‌నగర్, పరిగి, చేవెళ్ల, తాండూరు ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డిలు కలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం డిజైన్‌ను మార్చి నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివేన, ఉదండాపూర్ రిజర్వాయర్ల నిర్మాణ పనులను ప్రారంభించి, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని పక్కన పెట్టిందని మంత్రికి గుర్తుచేశారు. షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని చౌదరిగూడెం మండలంలో గల లక్ష్మీదేవిపల్లి వద్ద రిజర్వాయర్‌ను నిర్మిస్తే షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సైతం సాగునీరు పారుతుందని, తాగునీటి సమస్య కూడా తీరుతుందని మంత్రికి వివరించారు. వచ్చే బడ్జెట్‌లోనే నిధులు కేటాయించి, నిర్మాణ పనులను ప్రారంభించాలని ఎమ్మెల్యేలు కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగమైన కొందుర్గు-పరిగి-లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందిస్తామని తెలిపారు. పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు జిల్లాకు సాధించి తీరుతామని, గత ప్రభుత్వం ప్రాజెక్టును విస్మరించిందని, చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టు డిజైన్‌ను దారి మళ్లించి జిల్లాకు తీరని అన్యాయం చేసిందన్నారు. వికారాబాద్ జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల వరకు సాగునీరు అందనుందని తెలిపారు. పాలమూరు ఎత్తిపోతల ద్వారా ఏడాదిలోపు నీరు తీసుకవస్తామని, చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టు ద్వారా కూడా సాగునీరు తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపినట్లు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.



మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న శ్రీనివాస్ రెడ్డి, యాట నర్సింహ, బీక్యనాయక్

మంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

» 17న ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు రాక

కడ్తాల్, జూలై 14 : మండల కేంద్రంలో ఈనెల 17న రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటన ఏర్పాట్లను ఆదివారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. రూ.3.50 కోట్లతో అధునాతన సదుపాయాలతో నిర్మించిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ భవనాన్ని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలతో కలిసి శ్రీధర్‌బాబు ప్రారంభించనున్నారు. ఆదివారం కేజీబీవీ భవనం వద్ద ఏర్పాట్లను డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బీక్యనాయక్‌లు నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. భవనం పరిసరాలు, గదులు, నీటి వసతి, విద్యుత్ సదుపాయాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. భవనం ప్రారంభం అనంతరం నిర్వహించే సమావే శానికి స్థలాన్ని పరిశీలించారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశానుసారం పెద్ద ఎత్తున ఏర్పాట్లు , జనసమీకరణ చేస్తున్నట్లు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కేజీబీవీ భవనాన్ని ప్రారంభించిన అనంతరం సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, సేవాదల్ అధ్యక్షుడు గురిగళ్ల లక్ష్మయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గూడూరు భాస్కర్ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాములు పట్టి.. ప్రాణాలు కాపాడుతూ..

» సంవత్సరాలుగా ప్రజలకు సహకారం » ఆజంను అభినందిస్తున్న స్థానికులు



చెల్లాపూర్‌లో ఓ ఇంట్లో కొండ చిలువను పడుతున్న ఆజం

కులకచర్ల, జూలై 14: పామును చూస్తే ఎవరికైనా గుండె గుబేలుమనాల్సిందే. పొలం పనులకు వెళ్లిన కూలీలు, రైతులకు ఎక్కువగా పాముల భయముంటుంది. వర్షాకాలంలో వరదలకు ఇళ్లలోకి, ప్రభుత్వ కార్యాలయాల్లోకి పాములు చేరుతుంటాయి. కొన్ని సందర్భాల్లో వాటిని గమనించక పాముకాటుకు గురైన వారు కూడా ఉన్నారు. అయితే, కులకచర్ల మండలవాసులకు పాములు కనిపిస్తే వెంటనే స్థానిక పాములు పట్టే ఆజంకు సమాచారం అందిస్తుంటారు. ఇళ్లలోకి పాములు చేరినా, ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, సాగు భూముల్లో పాములు కనిపించిన వెంటనే ఆజంకు సమాచారం అందిస్తే క్షణాల్లో అతను అక్కడికి చేరుకొని పాములను పట్టుకుంటాడు. పట్టుకున్న పాములను డబ్బాల్లో, ప్లాస్టిక్ బస్తాల్లో బంధించి అటవీ ప్రాంతంలో వదులుతాడు. గత కొన్ని సంవత్సరాలుగా ఆజం పాములు పట్టి ప్రజల ప్రాణాలను కాపాడుతున్నాడు. పాముకాటుకు గురైన వారిని ఆస్పత్రికి చేరుస్తాడు. పాముల బారి నుంచి ప్రజలను కాపాడుతున్నాడు. పాములను ఎవరు చంపొద్దని, పాము కనిపిస్తే తనకు సమాచారం అందించాలని ఆజం కోరుతున్నాడు. జీవ వైవిధ్యంలో భాగంగా భూమిపై పాములు కూడా జీవించాలని ఆయన సూచించారు. పాములకు ఏదైనా నొప్పి కలిగిస్తేనే అవి కాటు వేస్తాయని, లేకుంటే వాటి దారిన అవి వెళ్లిపోతాయని తెలిపారు. ఓ స్వచ్ఛంద సంస్థ నుంచి శిక్షణ పొంది పాములు పట్టే పనిలో ఆజం నిమగ్నమయ్యాడు.

ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సాహకం అందించాలి




ఫోన్ సమాచారం (సెల్ నెం.6301567044) రాగానే వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి పామును పట్టుకొని అడవిలో వదిలేసి వస్తాను. నా సొంత పనులున్నా సమాచారం రాగానే ఆ ప్రాంతానికి వెళ్లి పామును పట్టి అటవీ ప్రాంతంలో వదిలేస్తాను. ఎవరి నుంచి ఏది ఆశించను. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి.

- ఆజం, పాములు పట్టే వ్యక్తి, కులకచర్ల

అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తించేలా కృషి

మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



బ్యాటరీ సైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, జూలై 14: నియోజకవర్గం పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందేలా తన వంతు కృషి చేస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మాన్యగూడ గ్రామానికి చెందిన ఎగిరిశెట్టి రాజు, కటికపల్లి గ్రామానికి చెందిన సుధాకర్‌లు అంగవైకల్యంతో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించిన ఎమ్మెల్యే ఆదివారం మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో వారికి బ్యాటరీ సైకిళ్లను అందజేశారు. అనంతరం సబితాఇంద్రారెడ్డి మాట్లాడారు. తనకు మహేశ్వరం నియోజకరవ్గం ప్రజలు మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారని, వారు తనకు అందించిన చేయూతను ఎప్పుడూ మరిచిపోనన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలందించడానికి ముందుంటానన్నారు. రెండు రోజుల క్రితం తాను కందుకూరు మండలంలో పర్యటించినప్పుడు రాజు, సుధాకర్‌లు వారి సమస్యలను తన దృష్టికి తెచ్చారన్నారు. ఈరోజు వారికి బ్యాటరీ సైకిళ్లను అందించడంతో పాటు అంగవైకల్యం ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రతీ సంక్షేమ పథకాలను అందించడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తాండ్ర దేవేందర్, ఎడ్ల ఉదయ్‌కిరణ్. తదితరులు పాల్గొన్నారు.

దాహదారి ఇబ్బందులు తీర్చాలి



ఎంపీకి సమస్యను వివరిస్తున్న సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, జూలై 14: ఘట్‌కేసర్, అన్నోజిగూడ, అంకుషాపూర్ వద్ద హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిని దాటేందుకు భూగర్భ వంతెన నిర్మాణం చేపట్టి ప్రజల ఇబ్బందులను తీర్చాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ(రాజ్యసభ) డాక్టర్ కె.లక్ష్మణ్‌ను కలిసి సమస్యలను వివరించారు. నగరంలోని ఎంపీ నివాసంలో ఆదివారం కలిసి సమస్యలను వివరించారు. ప్రధానంగా ఘట్‌కేసర్‌లోని మైసమ్మగుట్ట వద్ద, అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తావద్ద, అంకుషాపూర్ వెళ్లేందుకు భూగర్భ వంతెనలు నిర్మించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని ఎంపీని కోరారు. ఎంపీని కలిసిన వారిలో గొంగళ్ల బాలేష్, తౌర్యానాయక్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు ఆర్థికంగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వీరయ్య

వికారాబాద్, జూలై 14: పద్మశాలీలు సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా భాగస్వాములు కావాలని ఎస్ఏపీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ తాడూరి వీరయ్య పిలుపునిచ్చారు. అనంతగిరిలోని మార్కండేయ ప్రాంగణంలో ఆదివారం సంఘం అధ్యక్షుడు వర్కల మల్లేశం అధ్యక్షతన జరిగిన పద్మశాలి సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించే విధంగా కృషి చేయాలన్నారు. ఒకరికొకరి సహకారంతో ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని సూచించారు. సంఘం ఎన్నికల నిర్వహణ విధివిధానాలు నిర్ణయించి ఎన్నికలు నిర్వహించే తేదీని ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర నేత ఊట్ల బాలకిష్టయ్య, ప్రధాన కార్యదర్శి బామిని ఆంజనేయులు, మధుకర్, సైకిల్ కృష్ణ, తదితరులు హాజరయ్యారు.

చెంగోల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

తాండూరు రూరల్, జూలై 14: మండలంలోని చెంగోల్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 126మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరం ఏర్పాటు చేయించిన మాజీ జడ్పీటీసీ గౌడి మంజుల వెంకటేశం మాట్లాడుతూ మండల పరిధిలోని పేద ప్రజలకు ఈ శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అడిగిన వెంటనే ఉచిత వైద్య శిబిరానికి అంగీకరించిన డాక్టర్ పి.స్పందనరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉచిత వైద్య శిబిరం ప్రతినెలా ఏర్పాటు చేయిస్తున్నట్లు మాజీ ఎంపీటీసీ గౌడి వెంకటేశం తెలిపారు. శిబిరంలో మహాలక్ష్మీ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఆనంద్‌గోపాల్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొని వైద్యపరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో గౌడి విష్ణు, శృతిలయ, రవి, సీహెచ్ వెంకటయ్య పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయ పునర్నిర్మాణం

బొంరాస్‌పేట్, జూలై 14: దుద్యాల మండలంలోని పోల్కంపల్లి తండాలో పాతమైసమ్మ ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. తండావాసులు ఆదివారం నూతన ఆలయంలో మైసమ్మ విగ్రహాన్ని ప్రత్యేక పూజలతో వైభవంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి ఆలయంలో పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు పురోహితులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ముఖేశ్‌రాథోడ్, రైల్వే టీటీ లాల్యానాయక్, వ్యవసాయ శాఖ అధికారి రాజురాథోడ్, రవిరాథోడ్, గోబ్రియానాయక్ పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలు లేకుండా చర్యలు

ఘట్‌కేసర్, జూలై 14: కాలనీల్లో సమస్యలు లేకుడా చర్యలు తీసుకుంటున్నట్లు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మార్నింగ్ వాక్‌లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, సాయిగణేష్ నగర్‌లో ఆయన పర్యటించి స్థానికులతో చర్చించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా స్థానికులు డ్రైనేజీ నిర్మాణం చేయాలని కోరారు. దీంతో ఆయన స్పందిస్తూ డ్రైనేజీల నిర్మాణంతోపాటు సీసీ, బీటీరోడ్ల నిర్మాణంకు ప్రధాన్యత నిస్తున్నట్లు వివరించారు. అంతకు ముందు ప్రత్యేక శానిటేషన్ డే సందర్భంగా స్థానిక బందం కుంటలో దోమల నివారణ కోసం ఆయిల్‌బాల్స్ వేశారు. చెత్తను బయట వేయకుండా మున్సిపాలిటీ వాహనాలలో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శేఖర్, శ్రీనివాస్, కిషన్, మహేందర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా మున్సిపల్ వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్ ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీనర్సింహస్వామి కాలనీలో ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి వీధుల్లోని చెత్తను తొలగించారు.

ఘనంగా సీత్లా పండుగ



నైవేద్యాలు సమర్పించి పూజలు చేస్తున్న గిరిజనులు

బొంరాస్‌పేట్, జూలై 14: మండలంలోని మేడిచెట్టు, బోడబండతండాల్లో ఆదివారం గిరిజనులు మారెమ్మ (సీత్లా) పండగను ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన నాయకుడు లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ పూర్వీకుల నుంచి సంప్రదాయంగా ఈ పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పీర్లకు పూజలు



బషీరాబాద్, జూలై 14: మొహర్రం పండగను పురస్కరించుకొని పలు గ్రామాల్లో పీర్లు కొలువుదీరాయి. ఈ సందర్భంగా బషీరాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో సంప్రదాయబద్ధంగా అలంకరించిన పీర్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా హిందూ ముస్లింలు రాత్రి వేళలో డప్పు చప్పుళ్ల మధ్య లయబద్ధంగా అసైదులా ఆడుతూ సందడి చేస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసిన మేడ్చల్ పట్టణ వాసులు

మేడ్చల్ టౌన్, జూలై 14: మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని మాల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని బ్రాడ్వే కాలనీ వాసులు ఆదివారం మండలంలోని పూడూరు గ్రామ శివార్లలోని ఎంపీ ఈటల నివాసానికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా తమ కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. దీంతో స్పందించిన ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల సమస్యలను పరిష్కరించడానికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడతానని తెలిపారు. ప్రజలను పట్టిపీడిస్తున్న దీర్ఘకాలిక సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ పట్టణ అధ్యక్షుడు కొండం అంజనేయులు, నాయకులు సుధాకర్‌రెడ్డి, వంశీ విజయ్, శివ కుమార్ గుప్త పాల్గొన్నారు.

అమర జవాన్లకు ఘన నివాళి



కాశ్మీర్ ఉగ్రదాడిలో అమరులైన జవాన్‌లకు పరిగిలో నివాళులర్పిస్తున్న నాయకులు

పరిగి, జూలై 14: కాశ్మీర్‌లో ఈనెల 6, 8న జరిగిన ఉగ్రదాడిలో దేశం కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన అమర జవాన్లకు ఆదివారం పరిగిలో ఘనంగా నివాళులర్పించారు. ఎక్స్ సర్వీస్‌మెన్ సెంట్రల్ ఆర్మీ, పోలీస్ ఫోర్స్ జిల్లా అధ్యక్షుడు లింగమయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అమరులైన వీరజవాన్ల చిత్రపటాలు, జాతీయ జెండాను ఎత్తి పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిటైర్డు సీఏపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లింగమయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు కె.హన్మంత్ ముదిరాజ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.వెంకటయ్యలు మాట్లాడుతూ.. ఎండనక, వాననక కుటుంబాలకు దూరంగా ఉంటూ దేశ ప్రజలకు రక్షణగా ఉంటూ ఉగ్రదాడిలో ఎనిమిదిమంది సైనికులు ప్రాణాలు కోల్పోవడం విచారణకమని పేర్కొన్నారు. దేశ సైన్యంలో పనిచేయడమంటేరు చాలా గొప్పవిషయమన్నారు. వీర జవాన్ల ఆత్మకుశాంతి కలగాలని, వారి కుటుంబాలకు దేశ ప్రజలు అండగా నిలువాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎం గోపాల్, వెంకట్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కె.శ్రీశైలం, రిటైర్డు ఆర్మీ పోచయ్య, డాక్టర్ మహేశ్, న్యాయవాది జింకల యాదయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు లక్ష్మయ్య, రఘు, నర్సింహులు, ఇబ్రహీం, సాయిలు, దశరథ్, బుచ్చయ్య, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, కుమార్, నరేష్, కేశవులు, వెంకటయ్య పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల అయోమయం

- ఈనెల 19న డీఎస్సీ పరీక్ష
- ఇతర జిల్లాల్లో పరీక్షా కేంద్రాల కేటాయింపు
- అభ్యర్థులకు తప్పని తిప్పలు

పరిగి/కులకచర్ల, జూలై 14: పరీక్షా కేంద్రాలు దూర ప్రాంతాల్లో రావడంతో డీఎస్సీ పరీక్షలు రాసే అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. ఈనెల 19న డీఎస్సీ పరీక్షలను తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తోంది. మండలంలో వందకుపైగా అభ్యర్థులు డీఎస్సీ పరీక్షలు రాస్తున్నారు. రెండు రోజుల కిందట ప్రభుత్వం హాల్ టికెట్లు ఆన్‌లైన్ ద్వారా విడుదల చేసింది. హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్న అభ్యర్థులు పరీక్ష కేంద్రాలు చూసి అవాక్కయ్యారు. సాధారణంగా ఏ పరీక్షలు రాసినా జిల్లాలోనో లేదా, జీహెచ్ఎంసీలో జరిగేవి. అయితే ఈ సారి డీయస్సీ అభ్యర్థులకు మాత్రం దూరంగా ఇతర జిల్లాలకు కేటాయించడంతో పలువురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులకు కల్పించే జోన్, మల్టీజోన్ తరహాలో అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలు కేటాస్తున్నారు. సరిహద్దు జిల్లాలు కాకుండా రాష్ట్ర సరిహద్దులో ఉన్న జిల్లాలకు కేటాయించడం పట్ల అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షలు రాయాలంటే ఒకరోజు ముందుగా అక్కడికి చేరుకుని ఉండాలంటే లాడ్జిలు కూడా దొరకని పరిస్థితి ఉంటుందని వాపోతున్నారు. వందలాది మందికి దూరపు ఇతర జిల్లా కేంద్రాల్లో పరీక్షలు కేటాయించారు. ఇంకా పరీక్షలు వారంరోజుల సమయం ఉన్నప్పటికీ ఎలావెళ్లి పరీక్షలు రాయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రిపరేషన్ ఒక ఎత్తయితే, పరీక్షా కేంద్రానికి చేరుకోవడం పెద్ద సమస్యగా మారిందని అభ్యర్థులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పరీక్షాకేంద్రాలను అభ్యర్థులకు అందుబాటులో కేటాయించాలని డీఎస్సీ అభ్యర్థులు కోరుతున్నారు.

18న బషీరాబాద్‌కు మంత్రి కోమటిరెడ్డి రాక

బషీరాబాద్, జూలై 14: ఈనెల 18న బషీరాబాద్‌కు రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రాఫీ శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రానున్నట్లు తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. మండల కేంద్రంలో ఉదయం 11 గంటలకు జరిగే నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవానికి మంత్రితో పాటు, ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేతో కలిసి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు.

బ్యూటీషియన్ కోర్సుతో మహిళలకు ఉపాధి

జహీరాబాద్, జూలై 14: బ్యూటీషియన్ కోర్సుతో మహిళలకు ఉపాధి కల్పిస్తున్నట్లు ప్రముఖ బ్యూటీషియన్ లతరవికుమార్ తెలిపారు. రు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఆదివారం జహీరాబాద్‌లోని అతిథి-ఇన్‌లో సంగారెడ్డి, వికారాబాద్ ప్రాంతాలకు చెందిన 50మంది విద్యార్థులకు (మహిళలకు) ఒకరోజు సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. తమవద్ద నేర్చుకున్న వారికి హైదరాబాద్‌లోని పేరున్న బ్యూటీషియన్ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధప్రాంతాలకు చెందిన మహిళలు, శిక్షకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు



శామీర్‌పేట: సమ్మేళనంలో కలిసిన పూర్వవిద్యార్థులు



కీసర: చీర్యాల్‌లో మొక్కలు నాటుతున్న పూర్వ విద్యార్థులు

శామీర్‌పేట, జూలై 14: మూడుచింతలపల్లి మండలం కేశవరం జడ్పీ ఉన్నత పాఠశాల్లో 2003- 04 బ్యాచ్‌కు చెందిన టెన్త్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఒకేచోట చేరారు. తూంకుంటలోని ఆలంక్రిత రిసార్ట్‌లో ఎంతో ఆనందోత్సవాలతో ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆ రీసార్ట్‌లో ఎంతో ఆత్మీయంగా కలసి గత మధురస్మృతులను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సమ్మేళనంలో పూర్వ ఉపాధ్యాయులు స్వర్ణలీల, యాదగిరిస్వామి, సునీత, సుఖ్‌దేవ్, వినోద్‌కుమార్, నిర్మల, సత్తిరెడ్డి, సత్యనారాయణ, పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


కీసర: పదవ తరగతి చదివి 25 వసంతాలు అయిన సందర్భంగా పూర్వవిద్యారులు మొక్కలు నాటారు. మండలంలోని చీర్యాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం చీర్యాల్‌లో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు శాలువా తో సత్కారించి, ఘనంగా సన్మానించారు. ఆనంతరం 25మొక్కలను నాటి, వాటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

పరిగి: మండలంలోని పెద్దమాదారం ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళాన్ని నిర్వహించారు. పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో టెన్త్ చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఇక్కడ చదువుకుని వివిధ ప్రాంతాల్లో స్థిరపడినవారంతా ఒకచోట కలుసుకుని పాతజ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

ఘట్‌కేసర్: 1995 – 96వ సంవత్సరం ఘట్‌కేసర్‌లోని జడ్పీ హైస్కూల్ ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలోని ఓప్రైవేట్ హోటల్‌లో సమావేశమై అప్పటి గురువులను సన్మానించారు. విద్యార్థులు, గురువులు తమతమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.



పరిగి: పెద్దమాదారంఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు



ఘట్‌కేసర్: గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

సంక్షిప్తంగా..

- **ఘట్‌కేసర్:** ఘట్‌కేసర్‌లో వచ్చేనెల 18న బోనాల పండుగను నిర్వహించాలని తీర్మానించారు. ఆదివారం ఘట్‌కేసర్‌లోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. పట్టణంలో గ్రామ దేవతలు గుళ్ల నిర్మాణంలో ఉన్నందున 20రోజుల్లో నిర్మాణాలు పూర్తిచేసి బోనాల పండుగను నిర్వహించాలని నిర్ణయించారు.
- **దోమ:** బొంపల్లి గ్రామానికి చెందిన అప్పగాళ్ల ప్రవీణ్ పెద్ద కూతురు సంకీర్తన కిడ్నీ, ఊపరితిత్తుల సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతిరెడ్డి రూ.7వేలు, బోయిని చంద్రశేఖర్ రూ.5వేలు, కార్యకర్తలు తమ వంతుగా వైద్య ఖర్చుల కోసం రూ.20వేలు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు.
- **ఘట్‌కేసర్:** యువత అంబేడ్కర్ ఆలోచన విధానాలతో ముందుకు సాగాలని ఘట్‌కేసర్ బుడగజంగం సంక్షేమ సంఘం కార్యదర్శి కొండపల్లి నాగులు అన్నారు. అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులోగల అంబేడ్కర్ విగ్రహంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- **కులకచర్ల:** గీత కార్మికులకు బైక్‌లు ఇవ్వాలని గౌడ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్యగౌడ్, రాములుగౌడ్ అన్నారు. వారు కులకచర్లలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి గీత కార్మికులకు తాటి, ఈత చెట్లు ఎక్కేందుకు బెల్టు పంపిణీ చేయడం అభినందనీయమని హర్షం వ్యక్తంచేశారు. చెట్టు పైనుంచి పడి మృతిచెందిన గీత కార్మికులకు రూ.8లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా గీత కార్మికులకు చెట్లు ఎక్కేందుకు బెల్టులు పంపిణీ చేయాలని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, జూపల్లి కృష్ణారావులు గౌడలకు తగిన న్యాయం చేస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.
- **బొంరాస్‌పేట్:** బొంరాస్‌పేట్, తుంకిమెట్ల గ్రామాల్లో ఆదివారం జరిగిన వారంతపు సంతలో కూరగాయల ధరలు భగ్గుమన్నాయి. కేజీ టమాల ఏకంగా రూ.100 నుంచి రూ.120 ధరపలకడంతో ప్రజలు ఖంగుతిన్నారు. మరో వైపు బెండకాయ, బీరకాయ, వంకాయ ధరలు కేజీ 80 వరకు ధర పలికాయి. ధరల పెరుగులతో సామన్య ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఈ ధరల పెరుగుదల ఆగస్టు నెల దాటితే కానీ దిగి వచ్చే అవకాశం లేదని వ్యాపారులు చెబుతున్నారు.
- **మేడ్చల్ టౌన్:** ఎన్‌జీఓ కాలనీలో ప్రతీఒక్కరు తమ ఇంటివద్ద ఒక మొక్క తప్పనిసరిగా నాటాలని కౌన్సిలర్ స్వామి యాదవ్ కోరారు. వనమహోత్సవంలో భాగంగా ఆదివారం మున్సిపల్ పరిధిలోని ఎన్‌జీవో కాలనీలో కౌన్సిలర్ ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ స్వామి మాట్లాడుతూ.. కాలనీ పరిసరాలు పచ్చగా ఉండే విధంగా స్థానిక ప్రజలు కృషి చేయాలన్నారు. ప్రతీ ఒక్కరు తమ ఇంటి వద్ద కనీసం ఒక మొక్క తప్పని సరిగా నాటి దానిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.
- **ఘట్‌కేసర్ రూరల్:** బదిలీపై ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌కు వచ్చిన ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డిని ఆదివారం మర్రిపల్లిగూడ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మేడిపల్లి పోలీసుస్టేషన్ నుంచి ఆయన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌కు బదిలీపై వచ్చారు. మర్రిపల్లిగూడ మాజీ ఉపసర్పంచ్ మాయ నరేష్, మాజీ వార్డుసభ్యులు చిలుగూరి లక్ష్మణ్, ఆనంద్, మంగ ప్రవీణ్, సోమని ఈశ్వర్, గూడె సురేష్, భాస్కర్‌గౌడ్, మాయ వెంకటేష్, కొంద్ర శ్రీశైలం, చిలుగూరి జంగయ్యలు ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

క్రైం కార్నర్

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మూడుచింతలపల్లి, జూలై 14: వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేశవరం గ్రామానికి చెందిన కొంపల్లి సురేశ్(32)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలతో ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మూడుచింతలపల్లి, జూలై 14: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన ఆదివారం తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 12వ తేదీన గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడి వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందని తుర్కపల్లిలో యాచకుడిగా జీవిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి పట్టివేత

పూడూరు , జూలై 14 : జిల్లా మద్యనిషేధిత ఆబ్కారి అధికారి కె.విజయభాస్కర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని మిర్జాపూర్‌లో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. మిర్జాపూర్‌లో గంజాయి నిల్వలు ఉన్నాయని విశ్వసనీయ సమాచారం అందుకున్న జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మహ్మద్ ఆసిఫ్ ఇంట్లో 300గ్రాముల ఎండు గంజాయి లభించిందని తెలిపారు. అనంతరం అట్టి వ్యక్తిని విచారించగా, అతడు ఇచ్చిన సమాచారం మేరకు చేవెళ్ల మండలం అంతారం గ్రామానికి చెందిన మొల్ల షేర్జా ఇంట్లో సోదాలు నిర్వహించారు. అతడి వద్ద 300 గ్రాముల ఎండు గంజాయి లభించిందని, 150గ్రాముల గంజాయి విత్తనాలు లభించినట్లు వారు వివరించారు. ఈ ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని టాస్క్‌ఫోర్స్ జిల్లా అధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ప్రేమ్‌కుమార్ రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి, హన్మంతు, శివప్రసాద్, రవికిరణ్ పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వాలని తండ్రిపై దాడి.. కొడుకుపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 14: డబ్బులు ఇవ్వాలని కన్న తండ్రిపై దాడి చేసిన కొడుకుపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అంకుశాపూర్ గ్రామానికి చెందిన చింతకింది శంకరయ్య తార్నాకలోని ఎన్ఐఎన్ సంస్థలో ఉద్యోగంచేసి 2018లో ఉద్యోగ విరమణ పొందాడు. అతడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలుండగా వారికి వివాహం చేశాడు. కాగా ప్రస్తుతం చింతకింది శంకరయ్య భార్య లక్ష్మితో అంకుశాపూర్‌లోనే ఉంటున్నాడు. శంకరయ్య పెద్దకుమారుడు చింతకింది వేణుగోపాల్(44)కొన్నిరోజులుగా డబ్బులు ఇవ్వాలని తండ్రితో తరుచూ గొడవపడుతున్నాడు. శనివారం రాత్రి వేణుగోపాల్ తన తండ్రి శంకరయ్య ఉంటున్న ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి డబ్బులు ఇవ్వాలంటూ దాడి చేశాడు. ఆదివారం ఉదయం తండ్రి రాత్రి జరిగిన విషయాన్ని పక్కింటి వారికి చెప్పుతుండగా వేణుగోపాల్ తిరిగి తండ్రిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. దెబ్బలకు తట్టుకోలేక తండ్రి శంకరయ్య కొడుకుపై ఘట్‌కేసర్ పోలీసులు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



గురునాథ్‌రెడ్డిని సన్మానించిన లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్

కొడంగల్/కొడంగల్ రూరల్, జూలై 14: తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలు చేపట్టిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని ఆదివారం కొడంగల్‌లో అప్పాయిపల్లి గ్రామస్థులు సన్మానించారు. అదేవిధంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మురారివశిష్ఠ, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, లయన్స్ సభ్యులు మిఠాయి రాజు, డాక్టర్ సాకేత్‌లు ఆదివారం మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో వారు గురునాథ్‌రెడ్డిని సన్మానించారు. కొడంగల్ మాజీ ఉపసర్పంచ్ ఎస్ఎం. గౌసన్ ఆధ్వర్యంలో మైనారిటీ నాయకులు గురునాథ్‌రెడ్డిని సన్మానించారు.

మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలి

కులకచర్ల, జూలై 14: గంజాయి, డ్రగ్స్, మద్యం లాంటి మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని కులకచర్ల ఎస్ఐ అన్వేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కుస్మసముద్రం గ్రామంలో శనివారం రాత్రి కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగాగంజాయి, డ్రగ్స్, కొత్త చట్టాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కళాజాత బృందం పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



శామీర్‌పేట, జూలై 14: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా పదవీ బాధ్యతలను చేపట్టిన నగరి ప్రీతంను ఆదివారం శామీర్‌పేట మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని మజీద్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంకి మల్లేశ్, తుంకి రమేశ్, తుంకి భిక్షపతి, కుడుముల వెంకటేశ్, వినోద్‌కుమార్, రాంమోహన్, తదితర నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలను తెలిపారు.

ప్రమాదానికి గురైన స్నేహితుడికి ఆర్థిక సాయం

కులకచర్ల, జూలై 14: ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలలో 2002-03 పదోతరగతి చదివిన యువకుడు లోకారం నాలుగు నెలల కిందట పూడూరు మండలం మన్నెగూడ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అయితే లోకారం ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రమాదానికి గురై మండల పరిధిలోని పటేల్ చెరువు తండాలోని ఇంటి దగ్గరే ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న తోటి పదోతరగతి స్నేహితులు తుకారం, ఆనందం, రవి, నరేశ్, మంగ్యా, గోపాల్, నెహ్రూ స్పందించారు. ఆదివారం లోకారంకు రూ.12వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ఘట్‌కేసర్ రూరల్: తమతో పాటు చదువుకున్న బాల్యమిత్రురాలు రాచకట్ల రజిని మృతిచెందడంతో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఎదులాబాద్ 2004-2005 నాటి విద్యార్థులు ఆమె కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం ఎదులాబాద్‌లోని రజిని కుటుంబసభ్యులకు వారు రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. రజినితో పాటు ఆమె భర్త సైతం చనిపోవడంతో అనాథలైన ఇద్దరు చిన్నారులు ఎదులాబాద్‌లోని అమ్మమ్మ వాళ్ళ ఇంట్లోనే ఉంటున్నారు. చిన్నారులకు అండగా ఉంటామని వారు తెలిపారు. ఇచ్చారు.

బండి సంజయ్‌కు సన్మానం



శామీర్‌పేట, జూలై 14 : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఆదివారం లాల్‌గడి మలక్‌పేటకు చెందిన మేడ్చల్ జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలను తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు సదానందం, మున్నూరుకాపు సంఘం నాయకులు రాజ్‌కుమార్, నర్సింగ్, నవీన్, తదితర నాయకులు కూడా మంత్రి బండి సంజయ్‌ను కలసి సన్మానించారు.

● అనంతగిరికి పర్యాటకుల తాకిడి



ఇటీవల కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడటంతో పర్యాటకులు పచ్చని ప్రకృతిని చూసేందుకు అనంతగిరికి వచ్చేస్తున్నారు. వరుసగా సెలవులు రావడంతో ఆదివారం అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయానికి చేరుకుని నందిఘాట్ వద్ద ఫోటోలు దిగుతూ సందడి చేశారు. - వికారాబాద్